# మనిషి - నీడ



ట్రెయిన్ దిగి ఒకసారి అటూ ఇటూ పరికించి చూశాను. తెలిసిన వాళ్ళు చాలమంది కనిపించారు. కాని, ఎవరూ తనని అంతగా గుర్తుపట్టినట్లు లేదు. అవును! గుర్తు పట్టడానికి అవకాశ మెక్కడ? - సరిగ్గా తొమ్మిది సంవత్సరాల క్రితం - ఈ వూరు వదలి సిమ్లా వెళ్ళాను. వెళ్ళింది చలి ప్రదేశం కనుక నా రూపంలో చాల మార్పు వచ్చింది. నల్లగా వుండే శరీరం బాగా తెల్లబడింది. అప్పుడు సన్నగా, బక్కపలచగా వుండేవాడిని. ఇప్పుడు నిండుగా వున్నాను. వత్తుగా గిరిజాలు తిరిగి వుండే జుట్టు - ఇప్పుడు బాగా పలచబడింది. అమాయకంగా కనపడే కళ్ళు, ఎర్ర రంగును పులుముకొని, అద్దంలో ఎప్పుడూ తన వంక అదోలా చూస్తూనే వుంటాయ్. నాలో అప్పుడు లేనీ ఠీవి, దర్జా, దర్పమూ కొత్తగా వచ్చినయ్! సన్నటి పిల్లి గడ్డం - మంచి గంభీరత్వాన్ని తెచ్చిపెట్టింది. రిమ్‌లెస్ కళ్ళజోడు నాలో లేని ఏదో పెద్దరికాన్ని వెలికి చూపుతున్నది.

సూట్ కేసుని అందుకొని గబగబా నడిచాను. స్టేషన్ మాష్టరు రూమ్‌లోకి. కాజుయల్‌గా తొంగి చూశాను. రామబ్రహ్మంగారు లేరు. ఆయన డ్యూటీ వదలి వెళ్ళే మనిషి కాడే! మరెక్కడికి వెళ్ళివుంటాడు చెప్మా! ----నా పిచ్చికి నేను నవ్వుకున్నాను. అది తొమ్మిది సంవత్సరాల క్రితం సంగతి. ఆయన అప్పటికే రిటైరయే స్టేజిలో వున్నాడు. ఇక ఇప్పుడు ఆయనెందుకు వుంటాడిక్కడ? ఎ.యస్.యం.కృష్ణమూర్తి అయినా వున్నాడో లేడో! ఆలోచిస్తూ అడుగు ముందుకు వేశాను.

స్టేషన్ మాస్టర్ రూములోంచి బయటకు వస్తూ, నన్ను చూసి ఆగాడు కృష్ణమూర్తి, పరీక్షగా నా కేసి చూశాడు. బహుశా, నన్నెక్కడో చూసినట్టు అనిపించి వుంటుంది. కాని, నన్ను ఫలానా అని పోల్చలేదు. పోల్చుకో లేడు కూడా! నన్ను పలుకరిద్దామా, వద్దా అన్న సందిగ్ధంలో పడ్డట్టున్నాడు. మనిషి సతమతమవుతున్నాడు.

ఇక ఆయన్ని ఇబ్బంది పెట్టటం బాగుండదు. సన్నగా నవ్వాను-

"కృష్ణమూర్తిగారూ! కులాసా?" అంటూ.

ఆయన జవాబుగా చిన్న నవ్వు నవ్వాడు. ఒక క్షణం ఆగి "క్షమించాలి! మీ రెవరో నాకు గుర్తు రాలేదు" తన మతి మరపుకు నొచ్చుకుంటూ అన్నాడు కృష్ణమూర్తి.

"నేను గుర్తు రాకపోవటంలో మీ తప్పేమీ లేదులెండి, నేనే చాల మారిపోయాను, ఈ తొమ్మిది సంవత్సరాలలో! నేను రాంప్రసాద్‌ని. మీరు ప్రసాద్‌గారూ అని పిలిచే వారు. గుర్తున్నదా! మెరక వీధిలో నాలుగో నెంబరు...."

నా మాటకు అడ్డొస్తూ అన్నాడు ఆయన-

"మిమ్మల్ని అసలు గుర్తుపట్టలేకపోయాను సార్! చాలా మారిపోయారు. ఆ కాలంలో మీతో స్నేహం అంటే పడి చచ్చే వాళ్ళలో నేనూ ఒకడిని! మీరూ, నేనూ, విశ్వనాథం గారూ..... ఏమనుకొని ఏం లాభం లేండి! ఆ రోజులు మళ్ళీ వస్తాయా! కూర్చోండి ప్రసాద్‌గారూ! మిమ్మల్ని చూసి చాల రోజులయిందేమో, చాలా మాట్లాడాలనిపిస్తోంది. కాని ఏమిటో, ఏదీ మాట్లాడలేక పోతున్నాను" కుర్చీ చూపించాడు కృష్ణమూర్తి. బాయ్‌ని పిలిచి కాఫీకి ఆర్డరిచ్చాడు.

ఇక కూర్చోక తప్పలేదు. ఒకసారి గడ్డాన్ని చేత్తో మెత్తగా దువ్వుకొని కూర్చున్నాను.

కృష్ణమూర్తి నా స్వరూపాన్ని వింతగా చూస్తున్నాడు.

నాలో నేను నవ్వుకున్నాను.

"కృష్ణమూర్తి గారూ! ఏమిటి అలా చూస్తున్నారు?" అన్నాను కొంచెం గంభీరంగా అందామని ప్రయత్నం చేస్తూ.

ఆయన కొంచెం గాభరా పడ్డాడు.

"అబ్బే! ఏం లేదు. మీరు పూర్తిగా మారిపోయారు. పూర్వం ప్రసాద్ గారే అంటే నమ్మలేకుండా వున్నాను".

నేను వచ్చిన రైలు గట్టిగా కూత వేసింది, నాలోని భయాన్ని కప్పిపుచ్చుతూ.

"మీరే కాదు. ఎవరయినా అంతే! సిమ్లా వాతావరణం ఎవర్నయినా తొమ్మిది సంవత్సరాలలో ఇలా తయారు చేస్తుంది. ఆశ్చర్యపడవలసిన విషయమేంకాదు".

ఇంతలో కాఫీ వచ్చింది. కృష్ణమూర్తి నా ముందుకు ఒక కప్పు తోసి, రెండో కప్పు తను అందుకున్నాడు. నా వేపు స్నేహపూర్వకంగా చూసి, "ప్లీజ్ టేకిట్!" అన్నాడు.

ఆ వూరి రైల్వేస్టేషన్ కాఫీ త్రాగి చాల రోజులయింది. ఊళ్ళో వాళ్ళు కూడా ఆ రోజుల్లో స్టేషన్‌కి వచ్చేవాళ్ళు కాఫీ కోసం. ఇక్కడి కాంటీన్ నాయర్‌ని టౌన్లో కూడా ఒక బ్రాంచి పెట్టమని అందరూ వేధించేవాళ్ళు. మరెందుకో అతను స్టేషన్‌తోనే సరిపుచ్చుకున్నాడు. అందుకనే ఆత్రంగా అందుకున్నాను కాఫీని. రుచి చూశాను. మామూలుగానే వుంది. గుత్తి వంకాయ కూరలో కూరిన మరదలు పిల్ల వలపు సంగతేమిటో కాని, ఈ కాఫీలో నాయర్ అమృతహస్తం మాత్రం వున్నట్టు లేదు.

నా ఫీలింగ్‌ని కృష్ణమూర్తి గ్రహించినట్టున్నాడు.

"ప్రసాద్ గారూ! ఇప్పుడు మన నాయర్ లేడు. ఏదో తగాదా వస్తే లైసెన్స్ క్యాన్సిల్ చేశారు. ఈ కాఫీ అంత గొప్పగా వుండదు లెండి" అన్నాడు కాఫీని చప్పరిస్తూ.

కాసేపు వూళ్ళోవాళ్ళ గురించి అవీ ఇవీ మాట్లాడుకున్నాం. ఊరు అప్పటికీ ఇప్పటికీ చాల మారిపోయిందన్నాడు. మా ఫ్రెండ్స్ ఎవరెవరు ఎక్కడెక్కడ వున్నదీ చెప్పుకొచ్చాడు. రాంబ్రహ్మం గారు రిటైరయిన తరువాత కృష్ణమూర్తి యస్.యం. అయినాడుట.

నేను వచ్చిన రైలు గట్టిగా కూతవేసి బయలు దేరింది.

సడన్‌గా అన్నాడు కృష్ణమూర్తి.

"ప్రసాద్‌గారూ! ఇందాకటినుంచి అడుగుదామనుకొని, సంశయిస్తున్నాను. మీ భార్య ప్రమీలాదేవిగారు కనపడరేం! ఆవిడ మీతో రాలేదా!"

ఒక్కసారిగా దిగాలుపడిపోయాను. ముందు అనుకున్నట్టు గానే ఒక సాడ్ ఫీలింగ్‌ని ముఖాన పులుముకుంటూ గుండె ధైర్యం తెచ్చుకున్నాను. నా అద్భుతమైన నటనను చూపవలసిన సమయం వచ్చింది.

కృష్ణమూర్తి ఆసక్తిగా ముందుకు వంగాడు.

"ప్రమీలకు భర్తనని చెప్పుకునే అదృష్టం నాకికలేదు, కృష్ణమూర్తిగారూ!" నిర్లిప్తంగా అన్నాను.

కృష్ణమూర్తి వింతగా చూచాడు.

"అంతా వివరంగా చెబుతాను వినండి! ఇప్పటికి సరిగ్గా ఎనిమిది సంవత్సరాల క్రితం అనుకుంటాను. ఇక రెండు మూడు రోజులు అలాగే సిమ్లాలో గడిపి ఈ ఊరు వచ్చేద్దా మనుకున్నాం నేనూ, ప్రమిలా! అప్పటికి అక్కడ ఒక సంవత్సరం స్వర్గసుఖాలనుభవించాం! ఆ రోజు సిమ్లాలో మంచు బాగా కురుస్తున్నది. నేనూ ప్రమీలా స్కేటింగ్‌కి వెళ్ళాం! ఆ మనోహరమైన కొండల్లో తెల్లటి మంచు నిలిచి, చక్కటి చిత్రకారుని కుంచెకు కూడా అందనంత అందంగా వుంది. ఆ చలిలో బయటకు రాలేక సతమతమవుతూన్న సూర్యుడు తన అరుణారుణ కిరణాలతో వింత రంగును పులుముతున్నాడు. నేనూ ప్రమీల పరవశించి పోయాం - ఇంత అందమైన ప్రకృతిని చూడగలిగిన మేము నిజంగా ధన్యులం అనుకున్నాం.

"చల్లని ఆ మంచు మీద స్కేటింగ్ జోరుగా సాగుతున్నది. నున్నగా వున్న ఆ మంచు మీద అలా జారుతుంటే, చాల సరదాగా వుంటుంది. అదో విధమైన ఆనందంతో మమ్మల్ని మేమే మరచిపోయాం! అలా ఎంతసేపు తిరిగామో లెక్కలేదు. ఇంతలో జరగరానిదే జరిగిపోయింది. సర్రున ఆ మంచు మీద జారుతున్న ప్రమీల, ఆగలేకపోయింది. అసలు బేలన్స్ చేసుకోలేక పోయింది. అంతే! నా కళ్ళ ముందే అగాథంలోకి జారిపోయి అంతమయింది. శవం జాడ కూడా కనబడలేదు. నా ప్రమీల నన్ను వంటరిగా వదిలేసి వెళ్ళిపోయింది కృష్ణమూర్తిగారూ- వెళ్ళి పోయింది!"

ఒక్క నిముషం ఆగాను. కన్నీళ్ళు తుడుచుకున్నాను.

"ప్రమీల లేని ప్రకృతిలో నాకు ఏ అందమూ కనపడలేదు. కాని..... కాని..... ఎనిమిది సంవత్సరాలు ఆ ప్రకృతిలోనే గడిపాను! ఎందుకో తెలుసా..... ప్రమీల చనిపోయినా, ఆమె జ్ఞాపకాలతో బ్రతుకుదామని, నేనూ ఆమె కలిసి తిరిగిన ప్రదేశాలలోకి వెడితే ఏదో ఆనందం. ప్రక్కన ఆమె వున్నట్టుగానే అనిపించేది. నాతో ప్రమీల తానింకా బ్రతికి వున్నట్టుగానే మాట్లాడుతున్నట్లు ఫీలయేవాడిని. అందుకే యిన్నాళ్ళూ, ఆ వూరు వదిలి ఇక్కడకు రాలేకపోయాను. కాని, యీనాడు నేను ఒంటరిగా తిరిగి వచ్చాను. నా ప్రమీలను ఆ దూర దేశానికి బలిచేసి ఒంటరిగా తిరిగి వచ్చాను" - చేతుల్లో ముఖం దాచుకున్నాను. తల టేబిల్ మీదకి వంచాను. వెక్కి వెక్కి ఏడ్చాను.

కృష్ణమూర్తి చేయి నా తల మీద పడింది. ఆప్యాయంగా జుట్టు నిమిరాడు.

"క్షమించండి ప్రసాద్‌గారూ! అనవసరంగా గత విషయాలు త్రవ్వి మీ మనసు కష్ట పెట్టాను! ఐ యామ్ సారీ!" అన్నాడు.

నిరాశగా చూశాను అయన్ని, కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకొని.

కాసేపయిన తరువాత కృష్ణమూర్తి అన్నాడు-

"మీరు సిమ్లా వెళ్ళి ఒక సంవత్సరం వుంటారని చెప్పారు. మీరు వెళ్ళే డేట్ కూడా అనౌన్స్ చేశారు. మేమంతా కలిసి మీ దంపతులిద్దరికీ ఘనమైన సెండాఫ్ పార్టీ యిద్దామనుకున్నాం! కాని మీరు అనుకున్న దానికన్నా ముందుగానే ఎవరికీ తెలియజేయకుండా వెళ్ళిపోయారు. మళ్ళా ఇప్పుడు వచ్చారు! మీరు......"

అతని మాటకు అడ్డువస్తూ అన్నాను-

"కృష్ణమూర్తిగారూ! నాకారోజు ఇంకా బాగా గుర్తుంది. మీరు, మేము బయలుదేరే రోజు, అంటే పందొమ్మిదో తారీఖు పార్టీ యిద్దామనుకున్నారు. కానీ మేము పదమూడో తారీఖే సడన్‌గా రాత్రికి రాత్రే బయలుదేరి సిమ్లా వెళ్ళిపోయాము. కారణం మరేం లేదు? -- వయసులోని పొంగు - అంతే ఆనాడు వేసిన తాళం మళ్ళా యీ రోజు....." మనసులోని అనుమానాన్ని బలవంతంగా అణచుకుంటూ అన్నాను, అతని వేపు అదురుతున్న గుండెలతో చూస్తూ.

"ఆనాడు మీరు వేసిన తాళం ఈ నాటి వరకూ తెరుచుకో లేదు. ఎలా తెరుచుకుంటుంది. మీరు వస్తేనా! ఇల్లు అద్దెకు యివ్వవలసిన అవసరం కూడా మీకు లేదు. మీ ఎదురింటి వాడినవటం వల్ల, ప్రత్యేకంగా మీరు లెటర్ వ్రాయటం వల్ల - మీ ఇంటిని జాగ్రత్తగా కనిపెట్టే వున్నాననుకోండి!" అన్నాడు కృష్ణమూర్తి.

ఒకసారి హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. అనుమానం నివృత్తి అయింది.

"చాల థాంక్స్ కృష్ణమూర్తిగారూ! నేనిక ఇంటికి వెళతాను. ఇప్పటికే బాగా చీకటిపడింది. మళ్లా ఇంటి దగ్గర కలుసుకుందాం లెండి!" అన్నాను కుర్చీలోంచి లేస్తూ.

"నేను వచ్చేసరికి పదకొండో పన్నెండో అవుతుంది లెండి!" కరచాలనం చేస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

బయటకు నడిచాను. రిక్షా ఎక్కి ఇంటికి బయలు దేరాను.

మనసులో ఏదో ఆరాటం. ఏదో భయం, ఏదో వణుకుం నా ఆకారం, వీటిల్లో సగాన్ని కప్పి పుచ్చుతుంది. కాని గుండెల్లో ఏదో గుబులు.... అయినా గంభీరంగానే కూర్చున్నాను.

నా కథంతా కృష్ణమూర్తి నమ్మాడు. ఎవడికోసం నమ్ముతాడు? పకడ్బందీగా తయారుచేసిన కథ. అయినా బాగా డబ్బున్న వాడిని. నేనేం చెబుతే అది నిజమని నమ్మాలి ప్రజలు.

సందు తిరిగింది రిక్షా. ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్లయింది. సందు చివరగా నా యిల్లు. ఆ

ఇంట్లోనే సరిగ్గా తొమ్మిది సంవత్సరాల క్రితం నా భార్య ప్రమీలను నా చేతులారా చంపాను. రెండే రెండు కత్తి పోట్లకు కిక్కురుమనకుండా చచ్చింది. నరమానవుడికి తెలియని నగ్న సత్యం అది. ఆ నాడు నేను హంతకుడిని. స్వయంగా భార్యను చంపిన కిరాతకుడిని. కాని ఈ నాడు ఒక పెద్దమనిషిని. ప్రమాదవశాత్తు మరణించిన భార్యను మరచిపోలేక కుమిలిపోయి దేశాలు తిరిగిన ఆదర్శపురుషుడిని. లోకం దృష్టిలో మనసున్న ధనవంతుడిని.

నాలో నేనే నవ్వుకున్నాను. పెద్దగా వికటాట్టహాసం చేద్దామనుకున్నాను. కాని ఊరుకున్నాను.

ఇంకా కొద్ది దూరంలో వుంది నా ఇల్లు. నా పాపంలా వెలిగి పోవటం లేదు. కాని లోకం దృష్టిలో నా పుణ్యంలా మిణుకు మిణుకు మంటున్నది స్ట్రీట్ లైట్ కాంతిలో.

ఆగింది రిక్షా. ఠీవిగా దిగాను. రిక్షా వాడికి డబ్బులిచ్చేసి సూట్‌కేస్ అందుకున్నాను. మూడు అంతస్థుల భవనమైనా, చీకటిలో ఏమీ గొప్పగా కనబడటం లేదు.

మెయిన్ గేటుని తోశాను. తెరచుకోలేదు. తుప్పుపట్టినట్లుంది. అవును ఎన్నాళ్ళయిందో ఆ తలుపు తెరిచి. బలంగా తన్నాను. తలుపు తెరుచుకుంది కిర్రుమంటూ.

వీధి తలుపు తాళం కూడా బాగా తుప్పుపట్టింది. ఎన్నో సార్లు ప్రయత్నిస్తే గాని రాలేదు. కొంచెం బలం కూడా ప్రయోగించవలసి వచ్చింది.

లోపల అంతా చీకటిగా వుంది కన్ను పొడుచుకున్నా ఏమీ కనపడటం లేదు. కీచురాళ్ళ ధ్వని ఇంతా అంతా కాదు.

ఒక అడుగు ముందుకు వేశాను. ముఖం నిండా సాలెగూళ్ళు అంటుకున్నయ్. తొమ్మిది సంవత్సరాల మట్టీ మశానాన్ని నా శరీరం ఇవాళ అనుభవించాలి కావును. నిట్టూర్చాను. ముఖం మీద, తల మీద వున్న బూజుని సాధ్యమయినంతవరకు దులిపాను.

రెండడుగులు వేశాను. నా అడుగల శబ్దం నాకే వినిపించటం లేదు. అంటే నేల మీద మట్టి మందంగా పేరుకు పోయిందన్నమాట.

శరీరానికి తగులుతున్న బూజునీ, సాలెగూళ్ళనీ ఖాతరు చేయకుండా, లైట్ స్విచ్ వేపు చకచకా నడవబోయాను.

ఎవరో ముఖంమీద 'ఛట్' మని గట్టిగా కొట్టినట్లయింది. కళ్ళు బైర్లు కమ్మినయ్. ఒళ్ళంతా చమట పట్టింది. నోట మాట రాలేదు. ఒక క్షణం ఆగి ఊపిరి పీల్చాను. కాళ్ళ దగ్గర నుంచి ఒక గబ్బిలం నీరసంగా లేచి ఎగరసాగింది. నా ముఖానికి తగిలిందేమిటో అర్థమయింది. నా కంగారుకి నేనే విసుకున్నాను. స్విచ్ మీద చేయి వేశాను. చేతికి ఏదో మెత్తగా, జిగురుగా తగిలింది. ఏదో

వాసన గొట్టింది. అన్నీ భరించి స్విచ్ వేశాను. చీకటికి అలవాటు పడ్డ నా కళ్ళు ఒక్కసారిగా వెలుగు చూడలేవని కళ్ళు మూసుకుంటూ ఒక క్షణం ఆగి కళ్ళు తెరిచాను.

అయినా అంతా చీకటిగానే వుంది. లైట్లు వెలగలేదన్న మాట. తొమ్మిది సంవత్సరాలు ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టకపోతే సప్లయి వుంచుతారా? రేపు ఉదయం లేవగానే చూడవలసిన మొదటి పని అది.

టెలిఫోన్ చేసి పెట్రోమాక్స్ లైట్స్ తెప్పిద్దామను కున్నాను. ఒక క్షణం ఆలోచించి, నా ఆలోచనకి నేనే తిట్టుకున్నాను. రెగ్యులర్‌గా, డబ్బులు కట్టనప్పుడు ఆ కనెక్షన్ మాత్రం వుంచుతారా?

విధిలేక, ఆ చీకట్లోనే సూట్‌కేస్ తెరిచి, టార్చిలైటు తీశాను. వెలిగించాను. ఆ సన్నని కాంతిలో, ఆ పరిసరాల్ని చూసి విభ్రాంతి పొందాను.

ఏదీ సరిగ్గా కనపడనంత దట్టంగా పేరుకు పోయినయ్ సాలెగూళ్ళూ, బూజూ. ఇంటి పై భాగంలో రాకెట్లలా ప్రయాణం చేస్తున్నయ్ గుడ్లగూబలు. వాటి నృత్యానికి, సంగీతానికి రిథమిక్‌గా సప్లయి చేస్తున్నయ్ కీచురాళ్ళు. గోడలు రంగులు మారి ప్రస్తుతం ఏ రంగులో వున్నవో తెలుసుకోలేనంతగా వున్నయ్!

ఆ రాత్రి అక్కడ వుండటం ఏ మాత్రం మంచిది కాదు. ఏ హోటల్లోనో ఈ రాత్రి గడిపి రేపు యిల్లంతా బాగుచేయించి ఆ తర్వాతనే ఇక్కడ దిగాలని నిశ్చయించుకున్నాను. బయటకు నడవబోయాను.

చటుక్కున ఆగిపోయాను. ఇంత తెలివి తక్కువగా ఆలోచిస్తున్నందుకు నన్ను నేనే నిందించు కున్నాను. ఇప్పుడు హోటల్‌కి వెళ్ళి, మర్నాడు మందీ మార్బలంతో వస్తే, నేను చేసిన హత్య బయట పడిపోతుంది. ఇన్నేళ్ళూ పడిన శ్రమ వృథా అయిపోతుంది. ముందు నేను హంతకుడిని అని చూపించే ఆధారాలని మాయం చేయాలి! అసలు ప్రమీల ఇక్కడ హత్యచేయబడినట్టు ఏమాత్రం బయటకు రాకూడదు.

ఒకసారి గడ్డం దువ్వుకుని ఆలోచించాను. అసలు ప్రమీల హత్య ఏ విధంగా జరిగింది? అంతా కళ్ళకు కట్టినట్టు కనిపించసాగింది.

మొదట్లో నేనంటే మంచి యిష్టమే చూపేది ప్రమీల. ప్రమీల పెదిమలలోని మాధుర్యం, కళ్ళల్లోని మార్దవం నన్ను కరిగించి వేసినయ్! ప్రమీలకు దాసానుదాసుడనయి పోయాను. తరువాత పెళ్ళయిన నెల రోజుల్లోనే అర్థమయింది. ప్రమీల నన్ను కాక, నా డబ్బునే ఆరాధిస్తున్నదని. ఆమె పెళ్ళి కాకముందు, ఎవరికో మనసిచ్చిందని విన్నాను కూడాను. అప్పటినుంచీ అది

తెలుసుకోవాలనే ప్రయత్నంమీదే వున్నాను. నాలుగు రోజుల కొకసారి, వూరు వదలి వెడుతున్నట్టుగా నాటక మాడేవాడిని, రెండు రోజుల ప్రయాణం అని చెప్పి, వెళ్ళి, అంతకుముందే సడన్‌గా తిరిగి వచ్చేవాడిని, ప్రమీల, ప్రియుని చేతుల్లో దొరుకుతుందేమోనని. కాని ప్రమీల ఎప్పుడూ ఆ రకంగా కనపడేది కాదు. నేను వూరు వదలి వెడుతున్నందువల్ల విరహం అనుభవిస్తున్నట్టు కనపడేదే కాని, ఆనందిస్తున్నట్టుగా కనపడేది కాదు. అప్పుడే అనుకున్నాను. ఆమె అతన్ని మరచిపోవటానికి, ప్రయత్నిస్తున్నదని. అందుకే సిమ్లా వెళ్ళి ఒక సంవత్సరం వుండివద్దామని ప్రపోజ్ చేశాను.ఆ సంవత్సర కాలంలో ఆమె అతన్ని పూర్తిగా మరచిపోతుందనీ, తమిక హాయిగా వుండవచ్చనీ అనుకున్నాను.

అది పదమూడో తారీకు. ఎప్పుడూ సాయంత్రం ఆరింటికిగాని ఇంటికి రాని నేను, సినిమా టికెట్స్ బుక్ చేయించి, ఎంతో ఆనందంగా యింటికి వచ్చాను, ప్రమీలని సర్‌ప్రైయిజ్ చేద్దామని.

నా బెడ్‌రూంలో, నేను అనుకోని విధంగా ఆమె తన ప్రియుని చేతుల్లో వుంది అర్ధనగ్నంగా.

నాకు మతిపోయినట్టయింది. పిచ్చిగా గావు కేక పెట్టాను. ఇద్దరూ అనుకోని ఆ సంఘటనకు గాభరాపడ్డారు. సూటిగా వెళ్ళి, ఆమె ప్రియుడి మెడ పట్టుకున్నాను. ఆ కోపంలో ఏం చేస్తున్నానో నాకే తెలియదు. ఇష్టమొచ్చినట్టు కొట్టాను. ఎంతయినా, అతను నాకన్నా బలవంతుడు. అప్పటిదాకా, నిదానంగా వున్న అతను ఒక్కసారిగా విజృంభించాడు. ఎడా పెడా కొట్టసాగేడు. నేను అసహాయుడినయిపోయాను. బలంగా తగులుతున్న దెబ్బలకు తట్టుకోలేకపోయాను. ఒక్కసారిగా కళ్ళు తిరిగినయ్. చివరిసారిగా, అతడి పిడికిలి నా గడ్డం క్రింద ఖంగు మన్నది. అతను పారిపోయాడు. ఆ దెబ్బకు నాకు కళ్లు బైర్లు కమ్మినయ్.

కొంత సేపటికి వరకు కాని తేరుకోలేకపోయాను. ప్రమీల నా ప్రక్కన కూర్చుని వున్నది. ఆమె చక్కని కళ్ళల్లో ముత్యాల్లా నిలచిన నీళ్ళు - వెక్కి వెక్కి ఏడుస్తున్నదామె!

అప్పటికి గాని నాకు జరిగినదేమిటో అర్థం కాలేదు. తల మీద గాయం చాల బాధ పెడుతున్నది. గుండెల్లో గాయం మానేది కాదు. చటుక్కున లేచాను. ఆమెను విసరికొట్టాను. పిచ్చి కోపంలో ఈ చెంపా, ఆ చెంపా వాయించాను. విచక్షణాజ్ఞానం లేకుండా అడ్డమైన ప్రతిచోటా తన్నాను. ఆమెలాంటి వంచకికి ఆ శిక్ష చాలదు. ప్రక్కనే వున్న చాకుని బలంగా ఆమె గుండెల్లో దించాను. ఆమె గిలగిలా కొట్టుకుంది. చాకుని - కసిదీరా, మళ్ళీ ఆమె గుండెల్లో దించాను. మరి ఇక ఆమె కదల్లేదు.

తరువాత రెండు నిముషాలకి కాని బోధపడలేదు, నేను ఎంత ఘోరమైన పని చేశానో! కాలూ చెయ్యీ ఆడలేదు. ఆమె శవాన్ని ఏంచేయాలో తెలియలేదు. కనీసం పెరట్లో ఆమె శవాన్ని

పాతిపెట్టటానికి కూడా ధైర్యం చాల్లేదు.

మెరుపులా మెరిసింది ఒక ఆలోచన. అదే సిమ్లా ప్రయాణం. ఆమె శవాన్ని మంచం మీద పడుకో బెట్టాను. ఒక తెల్లని దుప్పటి, ఆమె నిండా కప్పాను. నా బెడ్‌రూం సౌండ్ ప్రూఫ్ గది. తలుపు గట్టిగా మూస్తే ఎన్నాళ్ళయినా, ఏ వాసనా బయటకు రాదు. అదే ధైర్యంతో ఆ వూరు వదలి వెళ్ళాను. వెళ్ళేముందు, ఆమె వైపు వారికీ, కృష్ణమూర్తికీ, మిగతా ఫ్రెండ్స్‌కీ లెటర్స్ వ్రాశాను. అనివార్య కారణాలవలన తనూ, ప్రమీలా, అనుకున్నదానికన్నా ముందుగానే సిమ్లా వెడుతున్నా మనీ, తర్వాత దేశాలన్నీ తిరగాలని వుందనీ, ఎన్ని సంవత్సరాల తర్వాత తిరిగి వస్తామో తెలియదనీ, మొత్తానికి కొన్నాళ్ళలో తప్పక తిరిగి వస్తామనీ వ్రాశాను. రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా సిమ్లా బయలు దేరాను. అక్కడ ఎవరితోనూ స్నేహం పెట్టుకోలేదు. నా ప్లాను సక్సెస్ కావాలంటే, అలాగే వుండాలి మరి. ఆ రకంగా తొమ్మిది సంవత్సరాలు గడిపాను సిమ్లాలో. మధ్య మధ్యలో జీవితాన్ని అనుభవించటానికి డెహ్రాడూన్ వెళ్ళివస్తూండేవాడిని. ఇన్నేళ్ళూ తిరిగి రావటానికి ధైర్యం చాలలేదు. చివరకు ధైర్యం చేసి, యిప్పుడు నా ఆస్తిని తనివితీరా అనుభవించటానికి మళ్ళీ యిక్కడకు వచ్చాను.

కనుక, ఇప్పుడు నేను ప్రమీల వస్తువులన్నీ మాయం చేయాలి. ప్రమీల శవం యింకా అస్థిపంజరం రూపంలో వుండి వుంటుంది. దాన్ని పెరట్లో పూడ్చిపెట్టాలి! నా అదృష్టం బాగుండి యిన్నాళ్ళూ - ఈ ఇంట్లోకి ఎవరూ రాలేదు! అటువంటి పొరపాట్లు ఇప్పుడేమీ జరగకుండా చూడాలి! ఇక్కడ పని పూర్తయిన తరువాత, నేను హోటల్‌కి వెళ్ళాలి. ప్రొద్దున్నే బుద్ధిమంతుడిలా వచ్చి ఇల్లు బాగుచేయించి కొత్త జీవితం గడపాలి.

నా ప్లానుకి నేనే మురిసిపోయాను--

ముందు ప్రమీల టాయిలెట్ రూంలోకి అడుగు పెట్టాను.

నా కాళ్ళు వాటంతట అవే ఆగిపోయినయ్! ఆ రూమ్‌లోంచి సన్నగా పాట వినిపిస్తున్నది. ఆ పాట.... ఆ పాట.... ఎక్కడో విన్నట్టుగా వుంది - ఇంకా సన్నగా కూని రాగంలా వినిపిస్తున్నది ఎక్కడ విన్నా అదే పాట అదే... అదే.... అవును! అదే -- నాకు బాగా గుర్తున్నది. ఆ పాట ప్రమీలకు చాలా యిష్టం - ఎప్పుడూ పాడుతూనే వుండేది. కాని ఆ పాట యిప్పుడెలా వినపడుతున్నది.... ఎలా..... ఎలా.....కాదు - ఇదంతా నా భ్రమ. భద్రంగా తాళం వేసిన ఈ యింట్లోకి, ఎవరు వచ్చి పాడతారు? అనవసరంగా భయపడుతున్నాను..... కాని..... కాని.... ఆ పాట ఇంకా వినపడుతూనే వున్నది, చెవులను తొలుస్తున్నది - ఆ గొంతు..... ఆ గొంతు.... ఎవరిది?..... వళ్ళంతా చెమట పట్టింది? గుండెల్లో ఏమిటో దడ - మళ్ళీ విన్నాను. మళ్ళీ మళ్ళీ

జాగ్రత్తగా విన్నాను? అవును - అది ప్రమీల గొంతే -- అది ప్రమీల గొంతు కాదని సరిపెట్టు కోటానికి నా మనస్సు వప్పుకోవటం లేదు - మరి ఏమిటిది? ఏమిటి? నాకేం అర్థం కావటం లేదు!

గుండెల్ని చిక్కబట్టుకున్నాను. లేని ధైర్యాన్ని తెచ్చుకున్నాను. టార్చిలైటు కాంతిని ఆ గదిలోకి ప్రసరింప చేశాను. ఆ చాలీ చాలని వెలుతురులో ఏదీ స్పష్టంగా కనపడటం లేదు. గుమ్మం దగ్గరనుంచీ, కుర్చీలు, బెంచీలు అన్నీ దుమ్ముకొట్టుకొని వున్నయ్! సాలెగూళ్ళూ, గుడ్లగూబలూ. పాట ఇంకా సన్నగా వినిపిస్తున్నది. అడుగు ముందుకు వేశాను. ఒంట్లో అదోలా వుంది కళ్ళు విప్పుకొని చుట్టూ చూశాను. దుమ్ము కొట్టుకొని చీకిపోయివున్న చీరల మధ్య కొన్ని కొత్త చీరలు చనిపోయిన రోజున ప్రమీల కట్టుకున్న నీలం చీర స్టాండు మీద వ్రేలాడుతున్నది. తొమ్మిది సంవత్సరాలు ఆ చీరలు పాడవకుండా ఎలా వున్నయ్? ఎలా....? బుర్ర పనిచేయటం లేదు. ఏదో అనుమానం వేసింది. టాయ్‌లెట్ టేబుల్ మీదకు టార్చిలైటు ఫోకస్ చేశాను.

గుండె ఆగినంత పనయింది. కలో మాయో అర్థం కావటం లేదు. నా కళ్లు నన్నేం మోసం చేయటం లేదు కదా! ప్రమీల నేను చేతులారా చంపిన ప్రమీల డ్రసింగ్ టేబుల్ ముందర కూర్చుని వున్నది. సన్నగా పాడుతూ మేకప్ చేసుకుంటున్నది! ఎలా... ఇది ఎలా సంభవం? హౌవ్ కెన్ ఇట్ బి? తల తిరుగుతున్నది.... గుండెల్ని ఎవరో గట్టిగా పిసుకుతున్నట్టు ఫీలవుతున్నానేమిటి? ఏదో అగాధంలోకి జారిపోతున్నట్టుగా వుంది.... ఏమవుతున్నది? నాకేమవుతున్నది?.... వాటీజ్ హేపెనింగ్ టు మి....? ఏమిటి... ఇలా.... ఇలా....

కళ్ళు మండుతున్నయ్! ఎందుకు నేనిలా నేల మీద పడి వున్నాను? నాకేమయింది! ప్రక్కన టార్చిలైటు అద్దం పగిలి అలా పడివుందేమిటి?

చటుక్కున లేచాను.

ఒళ్ళంతా నీరసంగా వుంది. తల దిమ్ముగా వుంది. ఎంతసేపలా పడివుండి వుంటాను? అసలెందుకు... అవును....ఆ పాట... ఆ పాట..... ఇంకా వినిపిస్తూనే వున్నది! ఆ పాట ఇంకా వినిపిస్తూనే వున్నది. చెమటకు పాంటూ, షర్ట్ బాగా తడిసిపోయినయ్! ఏమిటి ఇంత పిరికివాడి నయిపోతున్నాను? దీని అంతేమిటో తేల్చుకోవాలి! గబగబా ఆమె గొంతు వినపడిన వైపే నడిచాను. టార్చిలైటు మరీ గుడ్డిదయి పోయిందేమిటి? నా ఖర్మ! కాళ్ళు తడబడుతున్నయ్! గబగబా నడుస్తున్నాను. కాని, కాలు ముందుకి పడటం లేదు! నడిచాను.... నడిచాను.... ఇంకా నడిచాను... ఏదీ ప్రమీల ఏదీ? ఆ రాక్షసి..... నా ప్రేయసి..... ఒక్కసారిగా ఆగిపోయాను. బీరువా తెరచి వుంది? బీరువా ముందు నుంచొని సర్దుతున్నది.... ఎవరు? ఎవరో కాదు. నా చేతిలో ప్రాణాలు

విడిచిన ప్రమీల! బుర్ర వేడెక్కి పోతున్నది! ఎలా సాధ్యం? ఎలా? పెద్దగా అరిచాను! గబగబా ఆమెను సమీపించాను.

ఆమె నా వేపు తిరిగింది. ఆమె ప్రమీలే! ముమ్మూర్తులా నా ప్రమీలే! నమ్మలేక నన్ను నేను గిల్లుకున్నాను. ఆమె నన్ను చూసి నవ్వింది.

ఆమె నవ్వు చక్రాల్లా తిరిగి నన్ను చుట్టేస్తున్నది. కళ్లు బైర్లు కమ్ముతున్నయ్! కడుపులో ఏదోగా వుంది... తెరలు తెరలుగా... ఇలా....

గట్టిగా కళ్ళు తెరిచాను. లేని గుండె ధైర్యం తెచ్చుకొని, కళ్ళు చించుకొని మరీ చూశాను. ఎదురుగా ఆమె లేదు. కాని.... కాని... పాట వినిపిస్తున్నది!

పాట వినిపిస్తున్న వేపు గబగబా అడుగులు వేశాను--

అది నా బెడ్‌రూం! ప్రమీలని నేనక్కడే హత్యచేశాను!

తలుపు తోశాను. రాలేదు. బలం ప్రయోగించాను. తలుపు విరిగింది. లోపల ప్రవేశించాను. ఏ పాటా వినిపించటం లేదు. అంతా నా భ్రమ. మంచం మీదకు ఫోకస్ చేశాను టార్చిలైట్‌ని.

రంగు రంగులతో చీకిపోయిన దుప్పటి, ప్రమీల శవం మీద - అదే అస్థిపంజరం మీద కప్పబడి వుంది. నా భయానికి నేనే నవ్వుకోబోయాను. గుండె ఆగినంత పనయింది--

ఆ శవం మీద కప్పిన దుప్పటి, గుండెల దగ్గర, పైకీ, కిందకీ కదులుతున్నది. అంటే... అంటే... శవం ఊపిరి పీలుస్తున్నదన్నమాట. ఇందాకటిది భ్రమయితే మరి ఇది......? జవాబు దొరకదని తెలుసు.

మళ్ళా చూశాను.

నిజం! శవానికి వూపిరాడుతున్నది.

మళ్ళీ, మళ్ళీ చూశాను.

జరగనిదే, జరగరానిదే - జరుగుతున్నది!

ఎక్కడలేని మొండి ధైర్యం తెచ్చుకున్నాను మంచం వేపు అడుగులు వేశాను. కాళ్ళు గాలిలో తేలిపోతున్నయ్! అసలు అడుగులు పడటం లేదు! అయినా బలంగా అడుగులు వేస్తూ నడిచాను! ఏమిటీ తేలిపోతున్నాను.....

దగ్గరనించీ స్పష్టంగా చూశాను.

శవం ఊపిరి పీలుస్తున్నది---

గుండె దిటవు చేసుకున్నాను. నాకు నేనే ధైర్యం తెచ్చుకున్నాను. దుప్పటి తొలగించాను--

నా ఊపిరి ఆగిపోయింది. శ్వాస అందటం లేదు. కళ్ళు నమ్మమంటున్నయ్. చిరునవ్వుతో నిద్రలేచినట్టుగా లేచింది ప్రమీల. నిజంగా ప్రమీలే! అవును! నా భార్య ప్రమీలే! నాచేత హత్య చేయబడిన ప్రమీలే! ఏమిటది? ఎందుకు జరిగిందిలా? ఏమీ అర్థం కావటంలేదు--

ఆమె లేచి నుంచుంది. నా దగ్గరకు వస్తున్నది. నా మైండ్ నా కంట్రోల్ తప్పుతున్నది. నాలోని నెర్వస్ సిస్టమ్ దెబ్బతినలేదు కదా? ఏమి జరుగుతున్నది? ఎలా జరుగుతున్నది? అన్న ప్రశ్నలు బుర్రని సుడిగుండాల్లో పడేసి ఒక ఆట ఆడిస్తున్నయ్!

ఆమె చేతులు చాపింది. నా మెడ పట్టుకున్నదేమిటి? పెద్దగా అరిచాను. ఇంకా పెద్దగా అరిచాను.

నా నరాలు స్వాధీనం తప్పుతున్నయ్! నాలో ఏదో జరుగుతున్నది. అదే ఏమిటి? అర్థం కావటంలేదు. ఆమె ఇంకా నవ్వుతూనే వుంది! ఆమె నవ్వు నా చెవుల్లో గింగుర్లెత్తుతున్నది. పెద్దగా అరిచాను! మళ్ళీ అరిచాను. మళ్ళీ మళ్ళీ అరిచాను. పదే పదే అరిచాను. గుండెలవిసిపోయేలా అరిచాను... కాని ఆమె వదల్లేదు--

నేలవాలుతున్న నాకు నన్నెవరో పట్టుకోవటం లీలగా గుర్తుంది.

బలహీనంగా కళ్ళు తెరిచాను. బాగా తెల్లవారింది. నేను హాస్పిటల్ బెడ్‌లో వున్నాను. ప్రక్కన కృష్ణమూర్తి, డాక్టర్, హాస్పటల్ స్టాఫ్, తరువాత.... తరువాత... ఆత్రుతగా చూశాను. నా పాపాన్ని బయటకు లాగటానికి నుంచున్న -- ఇన్‌స్పెక్టర్ కనపడ్డాడు కాని, ప్రమీల కనపడలేదు. చుట్టూ వెతికాను. కాని ఆమె లేదు.

"ప్రమీల ఏది? కృష్ణమూర్తిగారు ప్రమీల ఏది?" గబ గబా అడిగాను.

"ప్రమీల తొమ్మిది సంవత్సరాల క్రితం మీ చేత చంపబడింది. ఇంకెక్కడి ప్రమీల?" అన్నాడు కృష్ణమూర్తి నా వేపు అసహ్యంగా చూస్తూ.

ఒకసారి అందర్నీ చూశాను. ఇక నిజం చెప్పక తప్పదు. బుకాయించి ప్రయోజనం లేదు.

"అది నిజమే! నేనే ప్రమీలను చంపాను. కాని.... కాని... నేను రాత్రి ఆమెను చూశాను. ఆమెని నా కళ్ళారా చూశాను. చీకిపోయిన చీరల మధ్య ఆమె కొత్త చీరలు చూశాను. మీకు ఇంకా నమ్మకం లేకపోతే, ఆమె బీరువా తెరచి ఏవో సర్దింది. అవన్నీ చూడండి. వెళ్ళండి. ఎంక్వయిరీ చేసి నాకు మనశ్శాంతి నివ్వండి. ఇన్‌స్పెక్టర్ మనశ్శాంతి నివ్వండి" పెద్దగా అరిచాను.

"అంతా మీ భ్రమ మిస్టర్ ప్రసాద్! నిన్న రాత్రే కాదు. ఎప్పుడో చనిపోయిన ప్రమీల తిరిగి రాలేదు. మీరు చెప్పినట్టు అక్కడ కొత్త చీరలూ లేవు -- ఏ బీరువా తెరచీ లేదు. మీరు లేని

పోని భ్రమలకు లోనయి వెర్రి కేకలు పెడుతుంటే కృష్ణమూర్తి గారు వచ్చారు. మీ భార్యని అస్థిపంజరం రూపంలో చూసి, మీ కేకలని అన్వయించుకుంటే, మాకు అసలు హంతకుడు సులభంగా దొరికిపోయాడు. మీరు ఎంత జాగ్రత్తగా హత్యని హుష్ చేద్దామనుకున్నా కుదరలేదు మిస్టర్! నిజం ఏనాటికైనా బయట పడక మానదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్. ●

*(అపరాధ పరిశోధన: మే - 1968)*